క్లుప్తంగా

అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి

• జిల్లావాసికి అరుదైన అవకాశం


బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కనగర్తికి చెందిన పుట్ట భూమయ్య–జానమ్మ దంపతుల కుమారుడు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డికి అరుదైన అవకాశం దక్కింది. అగర్తలా (త్రిపుర)లోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీలో అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్‌గా నియామకమయ్యారు. చంద్రశేఖర్‌రెడ్డి 2009 తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. విదేశీ విద్యార్థులకు సంబంధించిన వరల్డ్ ఆర్గనైజేషన్ ఆఫ్ స్టూడెంట్ అండ్ యూత్ (డబ్ల్యూవోఎస్‌వై) సంస్థకు హైదరాబాద్ చాప్టర్ కన్వీనర్, అంతర్జాతీయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించా రు. ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీలో చేరి 2017లో రసాయనశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డికి సింగిల్‌విండో వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పంటపొలాల పరిశీలన


రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

వేములవాడరూరల్: మండలంలోని చెక్కపల్లిలో పంట పొలాలను జిల్లా ఏరువాక కేంద్రం (డాట్ సెంటర్) కరీంనగర్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ శాస్త్రవేత్తలు డా.కె.మదన్ మోహన్ రెడ్డి, ఎమ్.రాజేంద్ర ప్రసాద్ పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో మొగిపురుగు, సల్ఫైడ్ దుష్ప్రభావాన్ని గుర్తించి రైతులకు తగు సూచనలు చేసినట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు, మొగిపురుగు లక్షణాలు, నివారణ చర్యలు తెలిపినట్లు తెలిపారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారిని అనూష, రైతులు మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, తిరుపతి, లక్ష్మయ్య, లోకుర్తి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో సమావేశం

వేములవాడ : క్రమశిక్షణ పెంపొందించేందుకు కోసమే విద్యార్థులకు యూనిఫాం అని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఇటీవల యూనిఫాం వేసుకురాలేదని హంసిని స్కూల్‌కు చెందిన విద్యార్థినిని పాఠశాల యాజమాన్యం పనిష్మెంట్ ఇచ్చిందని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. బుధవారం ఆయన ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో సమావేశమై మాట్లాడారు. స్కూల్‌పై బాలిక తల్లిదండ్రులు కేసు పెట్టడాన్ని నిరసిస్తూ ఈనెల 27న పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల బంద్ పాటిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ట్రస్మా పట్టణ శాఖ అధ్యక్షులు నరాల దేవేందర్, జిల్లా కోశాధికారి చిరంజీవి, రేగుల దేవేందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం ఎనిమీయా ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని బాలికలకు రక్తహీనత (ఎనిమీయా) పరీక్షలు చేసి ఐరన్ ఫోలిక్ మందులు అందించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు అరుణ, అఖిల్, ఫార్మాసిస్ట్ నరేందర్, కేజీబీవీ ప్రత్యేకాధికారి వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేటలో రెడ్ క్రాస్ సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 50 ఏళ్లు దాటిన 287 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ..రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, అంగన్‌వాడీ టీచర్లు బాబాయి, సుమలత, ఉప సర్పంచ్ వెంకట రమణరెడ్డి, వార్డుసభ్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

ఎల్లారెడ్డిపేట: మండల మాల మహానాడు అధ్యక్షుడిగా నీరటి భూమరాజంను బుధవారం నియమించారు. జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియమించిన భూమరాజం కృతజ్ఞతలు పేర్కొన్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

• మండలంలో 46 అంగన్‌వాడీ కేంద్రాలకు 18 సెంటర్లకు భవనాలు కరువు
• నిధులు సరిపోక నిలిచిన నిర్మాణాలు
• పట్టించుకోని అధికారులు


ఎల్లారెడ్డిపేటలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవన నిర్మాణం


రాగట్లపల్లిలో స్లాబ్ లెవల్‌లోనే నిలిచిన పనులు

ఎల్లారెడ్డిపేట: అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక చిన్నారులు, టీచర్లు ఇబ్బంది పడుతున్నారు. సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం మొత్తం నిధులు మంజూరు చేయడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఫలితంగా విద్యార్థులు, టీచర్లు అవస్థలు పడుతున్నారు. మండలంలో 24 గ్రామ పంచాయతీలుండగా 46 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 28 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, 18 కేంద్రాలను అద్దె భవనాలు, పాఠశాలల్లో కొనసాగిస్తున్నారు. ఎనిమిది భవనాలు స్లాబ్ లెవల్, రూఫ్ లేవల్ స్థాయిలో అసంపూర్తిగా ఉన్నాయి. భవనాలను పూర్తి చేసేందుకు ఏళ్ల తరబడి నిధులు మంజూరుకావడం లేదని అధికారులు తెలుపుతున్నారు. దీంతో పనులు ముందుకుసాగడం లేదు. చిన్నారుల సరైన వసతులు లేక అవస్థల పడుతున్నారు.

అసంపూర్తి నిర్మాణాలు..

మండలంలో 46 కేంద్రాలుండగా 28 కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. మరో 18 భవనాలకు ఎనిమిదేళ్ల క్రితం ఒక్కో భవనానికి రూ.8 లక్షల చొప్పున నిధులు మంజూరుకాగా పనులు ప్రారంభించారు. ప్రభుత్వం అనుమతులు లేకుండా మరో రూ.3లక్షలు జెడ్పీ నిధులు కలిపి రూ.13లక్షలతో భవనాలను అధునాతనంగా నిర్మించేందుకు పనులు చేపట్టారు. అయితే గత ప్రభుత్వం రూ.8లక్షలు మంజూరు చేయడంతో నిధులు సరిపోక నిర్మాణాలు ముందుకుసాగడం లేదు. ఆరున్నరేళ్లుగా పనులు జరుగుతున్నా పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాకపోవడంతో అసంపూర్తిగా నిర్మించారు. ఒక్కో భవనం స్లాబ్‌లెవల్, రూఫ్ లెవల్, బేస్‌మెంట్ వరకు పనులు చేపట్టినా పూర్తిచేసేందుకు అధికారులు పట్టించుకోవడం లేదు. ఎనిమిది నిర్మాణాలు అసంపూర్తిగా ఉండగా మరో 10 స్లాబ్, బేస్‌మెంట్ లెవల్ వరకే పరిమితమయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని వసతులు కల్పిస్తామని పాలకులు ఇస్తున్న హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. నిధులు పూర్తిస్థాయిలో మంజూరైతే నిర్మాణాలు పూర్తయ్యే అవకాశం ఉంది.

ఇరుకు గదులతో ఇబ్బంది

మండలంలోని 18 కేంద్రాలకు భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగుతున్నాయి. సరైన వసతులు లేక విద్యార్థులు ఇరుకుగదుల్లో ఇక్కట్లు పడుతున్నారు. వేసవిలో చిన్నారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసి అసంపూర్తి ఉన్న భవనాలను అన్ని వసతులతో అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

నిధులు మంజూరుకాగానే పూర్తి చేస్తాం



అద్దె భవనాలు, అసంపూర్తి నిర్మాణాలతో కేంద్రాలకు వచ్చే చిన్నారులు అవస్థలు పడుతున్నారు. సరిపడా నిధులు లేక పనులు ముందుకుసాగడం లేదు. మండలంలో 46 కేంద్రాలుండగా, 18 కేంద్రాలకు భవనాలు లేవు. అన్ని వసతులతో భవనాలు అందుబాటులోకి వస్తే చిన్నారుల సంఖ్య పెరుగుతుంది. కొన్ని చొట్ల తొందర్లోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తి చేస్తాం.

– లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ అధికారి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

• ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


క్రీడాప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట: నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సుద్దాలలో మహిళా సంఘం భవనం, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం (పల్లె దవాఖాన) భవనం, తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. మూలవాగుపై పలుగ్రామాల మధ్య వంతెనలు నిర్మిస్తామన్నారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ మండలాభివృద్ధికి ఇప్పటివరకు రూ. 3కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సుద్దాల గ్రామానికి రూ. 14 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవలక్ష్మి, ఉపసర్పంచ్ నాగరాజు, ఎంపీపీ చంద్రయ్య, ఎంపీటీసీ మమత, మాజీ వైస్‌ఎంపీపీ ఎల్లయ్య, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచులు బాల్‌రెడ్డి, మంజుల, ఎస్ఎంసీ చైర్మన్ విజయ్, వీవో అధ్యక్షురాలు వజ్రవ్వ, సీసీ రేణుక, కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజు, గంగయ్య, రెడ్డి, మహేశ్, సంజీవ్, పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందిస్తాం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

ముస్తాబాద్: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. మండలంలోని ఆవునూర్, కొండాపూర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందనకల్, గన్నెవారిపల్లెలో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సర్పంచులు కల్యాణి, లక్ష్మి, రవీందర్‌రెడ్డి, రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు సతీశ్ చందర్, భాను, పద్మారెడ్డి, కరుణాకర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సిరిసిల్లక్రైం: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై రాజు అన్నారు. పట్టణంలో బడ్స్ అండ్ ఫ్లవర్స్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై బుధవారం అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరితగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఐవైఎస్‌వో అర్గనైజర్ ఓర్యూ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో పలువురికి గాయాలు


చిన్నారిని పరామర్శిస్తున్న ఎంపీపీ

తంగళ్లపల్లి: వీధికుక్కల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామానికి చెందిన వడియాల సవితరెడ్డి (3), తిరువీధుల మహేంద్ర(5), గుంటి శ్రీజ (11), గుంటి వైష్ణవి(27), శనిగరపు మల్లేశం(40), ఆకుల రాజు(40), వడియాల రాజిరెడ్డి (70) వీధికుక్కల దాడిలో గాయపడ్డారు. చికిత్స కోం ఇల్లంతకుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఎంపీపీ వుట్కూరి వెంకటరమణా రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేశవరెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

సుద్దాలలో ప్రొటోకాల్ రగడ

కోనరావుపేట: మండలంలోని సుద్దాలలో బుధవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీటీసీ కాశవేని మమత మహేశ్, ఎస్ఎంసీ చైర్మన్ ఎరవెల్లి విజయ్ ఆరోపించారు. గ్రామంలో పల్లె దవాఖాన, క్రీడాప్రాంగణాలను ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరై వెళ్లాక ఎంపీటీసీ మమత సర్పంచ్ దేవలక్ష్మి, శంకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాఫలకంలో తమపేరు ఎందుకు లేదని ఎంపీటీసీపాటు, ఎస్ఎంసీ చైర్మన్ ఆరోపించారు.

సంక్షిప్త వార్తలు

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత

గంభీరావుపేట: మండలకేంద్రంలోని కేజీ టు పీజీ విద్యాలయంలో భాగమైన జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు పలువురు ఉపాధ్యాయులు రూ.20వేల విలువైన మైక్‌సెట్‌ను అందజేశారు. గతంలో పాఠశాలలో పనిచేసిన గంగారాం, శ్రీనివాస్, రవీందర్, ప్రస్తుతం పనిచేస్తున్న రమ, శ్రీకాంత్‌రెడ్డి, రాజయ్య, శివకుమారస్వామి, కిషన్, మల్లికార్జున్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మైక్‌సెట్‌ను అందించారు.

కిరాణ దుకాణంలో చోరీ

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేట శివారులో రామన్నపల్లెలో గుంటి పర్శరాములుకు చెందిన కిరాణా దుకాణంలో బుధవారం చోరీ జరిగింది. దుకాణంలోని ఉన్న సిగరెట్ ప్యాకెట్లతో పాటు రూ.10 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి దొంగతనానికి పాల్పడినట్లు సీసీ కెమెరాలో నమోదైంది.

తంగళ్లపల్లి: మండలంలోని తాడూర్ గ్రామానికి చెందిన మధుప్రియ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ తంగళ్లపల్లి ఎంపీటీసీ కోడి అంతయ్య పరామర్శించారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

కోనరావుపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడాపోటీలు నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం, ముగ్గులపోటీలతో పాటు పలు పోటీలు నిర్వహించారు.

బియ్యం వితరణ

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లికి కుంచం దేవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పెంతల శ్రీనివాస్ 50 కిలోల బియ్యం అందజేశారు.

సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి దూరం

ముస్తాబాద్: కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి మండలానికి చెందిన వారియర్స్ దూరంగా ఉన్నారు. తొమ్మిదేళ్లుగా సోషల్ మీడియాలో బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాల ప్రచారం, ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుకోసం పనిచేసిన తమను గుర్తించకుండా ఇతరులను సమావేశానికి పిలిచారని సోషల్ మీడియా వారియర్ దెొట్టి నాని ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలో సోషల్ మీడియా వారియర్స్‌లో కీలకంగా పనిచేసిన నాళ్ల చారి, నందు, తనకు సమావేశం సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇతర బీఆర్ఎస్ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఈ విషయంపై ఫిర్యాదు చేస్తామన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

బోయినపల్లి: వేములవాడ నుంచి స్తంభంపల్లి, బూర్గుపల్లి, కోరెం, అనంతపల్లి, నల్లగొండ గ్రామాల మీదుగా జగిత్యాల జిల్లా కేంద్రానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండలంలోని అనంతపల్లి సర్పంచ్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వేములవాడ డిపో మేనేజర్ మురళికృష్ణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ తెలిపారు.

పరామర్శ

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లికి చెందిన నాగుల శంకర్ తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం శంకర్‌ను స్థానికులు అంబులెన్స్‌లో పట్టణంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సంగస్వామి యాదవ్ శంకర్‌ను పరామర్శించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రుల చెంతకు


చిన్నారిని అప్పగిస్తున్న పోలీసులు

ముస్తాబాద్: తప్పిపోయిన బాలికను పోలీసులు గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పోలీసుల కథనం మేరకు మండలకేంద్రానికి చెందిన దొక్క స్వప్న కూతురు నందిని బుధవారం ఇంట్లో ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. ఆందోళనకు గురైన స్వప్న చిన్నారి ఆచూకీ కోసం అంతా వెతికింది. విషయం పోలీసులకు తెలియడంతో ఏఎస్సై వెంకటరమణ, పీసీలు బాలశ్రీను, కుమార్ పట్టణంలో గాలించారు. ముస్తాబాద్ రాజీవ్‌చౌక్‌లో చిన్నారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. ఏఎస్సై వెంకటరమణ, పీసీలను ఎస్సై శేఖర్ అభినందించారు.

సన్మానం

గంభీరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన షబ్బీర్ అలీని కాంగ్రెస్ మండల నాయకులు బుధవారం కామారెడ్డిలో కలిశారు. ఆయనకు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, అంజిరెడ్డి తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లిలో 1992–93 పదో తరగతి చదివిన విద్యార్థులు తమ స్నేహితుడి కూతురు వివాహానికి ఆర్థికసాయం అందించారు. అంకుషాపూర్ గ్రామానికి చెందిన యాదగిరి మృతిచెందగా మృతుడి కూతురు వివాహానికి బాల్య స్నేహితులు బుధవారం రూ.45 వేలు అందజేశారు. బాల్యమిత్రులు కోడి అంతయ్య, మచ్చ శ్రీనివాస్, దేవదాస్, మహేందర్, కోడం శ్రీనివాస్, వేదాంతం ప్రశాంత్, ఆకాని జయపాల్ రెడ్డి, శ్రీనివాస్, బుస్స చంద్రం, బండి శ్రీధర్, వి.సత్యం, వి.రమేశ్, దేవరాజు, శ్రీనివాస్, రవి, పవన్, జలందర్, రమేశ్, రాములు పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన 5నెలల చిన్నారికి చికిత్సకు ఆపద్బాంధవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. పట్టణానికి చెందిన మాచర్ల లావణ్య–మల్లేశంకు ఐదునెలల బాబుకు లివర్‌కు సంబంధించి చికిత్స అందించాల్సి ఉంది. ఈ విషయం ఫౌండేషన్ అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్‌కు తెలుపగా స్పందించారు. దాతల సాయంతో సేకరించిన రూ.15వేలను చిన్నారి తల్లిదండ్రులకు అందించారు. ఫౌండేషన్ సభ్యులు జహీర్, నవీన్, సాయి తదితరులున్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న హెచ్ఎం అనురాధ

ముస్తాబాద్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రత్యేకాధికారి శ్రీలత అన్నారు. మండలంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం, బాలికల ఉన్నత పాఠశాలల్లో బాలికా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పలుపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా కానిస్టేబుల్ మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలలో..

తంగళ్లపల్లి: జిల్లెల్ల ప్రభుత్వ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం అ నురాధ విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం అనురాధ మాట్లాడుతూ మాట్లాడారు. వ్యక్తిగత శుభ్రత, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీసీఈసీ కన్వీనర్ పి.శారద, ఉపాధ్యాయులు నీరజ, రేణుక, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, టీచర్లు కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటారు.

వస్త్ర పరిశ్రమను కాపాడాలి

సిరిసిల్లటౌన్: సంక్షోభంలో ఉన్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను కాపాడాలని సీపీఐ నాయకుడు, ఆపార్టీ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డిని కోరారు. బుధవారం సీపీఐ సీనియర్ నాయకుడు సామల మల్లేశం అనారోగ్యంతో బాధపడుతుండగా సిరిసిల్లలో పరామర్శించారు. అనంతరం ఆయనను కలిసిన పార్టీ నేతలు మాట్లాడారు. ప్రభుత్వం బతుకమ్మ చీరల సంబంధిత బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. విద్యుత్ సబ్సిడీ, ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, నాయకులు పంతం రవి, రాములు, చంద్రమౌళి, వేణు, విజయ, తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం


సర్పంచులను సన్మానించిన నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచులకు ఆత్మీయ సన్మానం చేశారు. ఈనెల ఆఖరున పదవీకాలం ముగియనుండటంతో మండలంలోని అన్నిగ్రామాల సర్పంచులను సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు ప్రభుత్వం మంజూరు చేసేలా పోరాటం చేయాలన్నారు. వైస్ ఎంపీపీ భాస్కర్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండాపురం బాల్‌రెడ్డి, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ రామచంద్రం, డీటీ జయంత్‌కుమార్, ఎంపీవో వజీర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి


ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట: మండలం మర్తనపేట సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణరావుపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతిగౌడ్ తహసీల్దార్ విజయప్రకాశ్‌రావుకు ఫిర్యాదు చేశారు. వంశీకృష్ణరావు సర్పంచ్‌గా వేతనాన్ని పొందుతూ రేషన్ డీలర్‌గా కమీషన్ తీసుకుంటున్నారని తెలిపారు. గ్రామ శివారులో రైస్‌మిల్లులో భాగస్వామిగా ఉన్నాడని, అందులో ఇటీవల రేషన్ బియ్యం పట్టుబడినట్లు పేర్కొన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు రామచంద్రం, మోహన్, అజయ్, తదితరులున్నారు.

రిజర్వాయర్ తూముకు మరమ్మతులు

రుద్రంగి: ఇటీవల మండలంలో జరిగిన ప్రజాసమస్య పరిష్కార వేదికలో నాగారం రిజర్వాయర్ తూము కూరుకుపోయి లీకవుతుందని రైతులు ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఇరిగేషన్ అధికారులను ఆదేశించగా వారు రిజర్వాయర్ తూమును పరిశీలించారు. బుధవారం తూముకు మరమ్మతులు చేపట్టారు. ఇరిగేషన్ ఈఈ సంతు ప్రకాశ్ రావు, డీఈ ఎం శ్రీనివాస్, ఏఈ హుషార్ సింగ్, డబ్ల్యూఐ అర్షద్ ఉన్నారు.

'రిపబ్లిక్ డే'కు ఏర్పాట్లు

వేములవాడ: ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వేములవాడ పట్టణంలోని పలు దుకాణాల్లో జెండాలు, త్రివర్ణ పతకాలను సిద్ధంచేశారు. బుధవారం పెద్దఎత్తున విద్యా సంస్థల యాజమాన్యాలు, ప్రభుత్వ స్కూళ్ల హెచ్ఎంలు, టీచర్లు, విద్యార్థులు, పేరెంట్స్ పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేశారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం



వేములవాడరూరల్: మండలంలోని మర్రిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ మల్లేశం అల్పాహారం అందజేశారు. గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా ఉదయం, సాయంత్రం స్నాక్స్ అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం మాధవి లత, ఉమామహేశ్, విజయ్‌కుమార్, రమ, పద్మ, సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వంటగది నిర్మాణానికి భూమిపూజ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వర తండాలోని ప్రాథమిక పాఠశాలలో రూ.3.40లక్షల వ్యయంతో నిర్మించే వంటగది నిర్మాణానికి సర్పంచ్ అజ్మీరా రజిత బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా యూత్ నాయకులు తిరుపతినాయక్, ఎస్ఎంసీ చైర్మన్ గుగులోతు సురేశ్ నాయక్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.